సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 1 । మార్చి । 2025

I

అంకెల గారడీ



కూటమిప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీగా ఉంది. కేటాయింపులు అరకొరే. బడ్జెట్ ప్రసంగం మొత్తం చంద్రబాబు, లోకేష్‌లను పొగడటానికే సరిపోయింది. . సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి, ప్రజలను నమ్మించి, నిలువునా ముంచేశారు. ఇది ప్రజలను మోసం చేసే బడ్జెట్.

- నిసార్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మదనపల్లె

పేదలకు ఒరిగేదేమి లేదు



రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో పేదలకు ఒరిగేదేమీ లేదు. బడ్జెట్ ప్రసంగం ఆద్యంతం "ఆత్మ స్తుతి, పరనిందలతో అంకెల గారడీగా సాగింది. గత ప్రభుత్వాన్ని తిట్టడం, చంద్రబాబు, లోకేష్‌ని పొగడడంతోనే సరిపెట్టారు. పేదలు, కార్మికులు, రైతులకు మేలు చేయని బడ్జెట్.

- పి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శి

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 85 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	563	563

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 30.260 కిలోలు

న్యూస్‌రీల్

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తొలగింపు

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ ఫణి రాజకుమారి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2023–24 సంవత్సరంలో ఇద్దరి హౌసింగ్ బిల్లులకు సంబంధించి ఒకరికి బదులు మరొకరికి చెల్లింపు చేశారన్నారు. హసీనా బేగంకు బదులు వెంకటలక్షుమ్మకు, పద్మావతికి బదులు ఫమీదాకు చెల్లింపు చేశారు. సోషియల్ ఆడిట్‌లో నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తాత్కాలిక విధులనుంచి తొలగించామన్నారు. 7 రోజుల్లో డబ్బులు రికవరీ చేసి విజయవాడలోని కమిషనర్ రూరల్ డెవలప్‌మెంట్ వారికి చెల్లించాలన్నారు. అలాగే కడప ద్వామా పీడీకి సంజాయిషీ ఇవ్వాలని ఏపీఓ తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



విజేతలతో డీఈఓ సుబ్రమణ్యం, అధికారులు

రాయచోటి: వికసిత భారత్ సాధించాలంటే యువత నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం రాయచోటిలో జిల్లాస్థాయి జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. రాయచోటి ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, సెమినార్ పోటీలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలల నుంచి 136 మంది పాల్గొన్నారు.

- దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ప్రదర్శనలో మొదటిస్థానం సాధించిన కలకడ ఆదర్శపాఠశాల విద్యార్థులు సుహేల్, రెహాన్, గైడ్ టీచర్ సుమతీలను డీఈఓ అభినందించారు.

ఒంటిమిట్ట సాక్షి విలేకరిపై దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఒంటిమిట్ట మండల సాక్షి రిపోర్టర్ వెంకటకృష్ణపై పురావస్తు శాఖ కాంట్రాక్టర్ కృష్ణమూర్తి దాడికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలయ జీర్ణోద్ధరణ పనుల ఫొటోలు తీసేందుకు వెంకటకృష్ణ వెళ్లగా అడ్డుకున్న పురావస్తు శాఖ కాంట్రాక్టర్ కృష్ణమూర్తి ఎలా ఫొటోలను చిత్రీకరిస్తున్నావ్ అంటూ బెదిరించడమే కాక దుర్భాషలాడారు. విలేకరి చొక్కా పట్టుకొని బయటికి గెంటివేశాడు. విషయం తెలుసుకున్న పాత్రికేయులు సంఘటనపై ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు చేరుకోగా ఒంటిమిట్ట సీఐ బాబు విలేకరులను అరగంటకు పైగా నిరీక్షింపజేశారు. ఓపిక నశించిన వారు సీఐ చాంబర్‌కు వెళ్లి ఘటనను వివరించినా స్పందన లేదని పాత్రికేయులు వాపోయారు. అంతకుముందు ఎస్ఐ శివప్రసాద్‌కు పాత్రికేయుల బృందం ఫిర్యాదు చేసింది.

అదే వంచన

- సీమ సమగ్రాభివృద్ధి ఉత్తి మాటే..!
- ఊసే లేని ఉక్కు పరిశ్రమ
- వైఎస్సార్–ఈఎంసీకి లభించని చోటు
- అన్నమయ్య ప్రాజెక్టు ప్రస్తావన లేదు
- కడప, అన్నమయ్య జిల్లాలకు లోపించిన ప్రాధాన్యం
- రాష్ట్ర బడ్జెట్‌లో కూటమి సర్కార్‌ది సవతి తల్లి ప్రేమ
- పెదవి విరుస్తున్న ఆర్థిక రంగ నిపుణులు, రాజకీయ పక్షాలు



వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం (ఫైల్)



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి సర్కారు రాయలసీమ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రకటించడం ఉత్తి మాటేనని తేటతెల్లమైంది. బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ఊసే లేదు. వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ ప్రస్తావన లేదు. అన్నమయ్య ప్రాజెక్టు పునఃనిర్మాణంపై దృష్టి లేదు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తొలిసారి ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించారు. జనాభా ప్రాతిపదికన లేదా భూ విస్తీర్ణం ప్రాతిపదికన ఎటు చూసినా రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేశారని ఆర్థిక నిపుణులు వాపోతున్నారు. సాగునీటి రంగ ప్రాజెక్టులకు సైతం సరైన న్యాయం లభించలేదని రాజకీయ పక్షాలు నినదిస్తున్నాయి.

అంకెల గారడి

2025–26 వార్షిక బడ్జెట్‌లో చంద్రబాబు సర్కారు పరనిందా–ఆత్మస్తుతి మినహా ప్రాధాన్యత లోపించందని నిపుణులు వివరిస్తున్నారు. రూ.3,22,359 కోట్ల బడ్జెట్ అంకెల గారడిని తలపిస్తోందని రాజకీయ నేతలు భావిస్తున్నారు. దాదాపు రూ.80 వేల కోట్ల లోటు బడ్జెట్‌ను ఎలా పూడుస్తారో, ఆదాయ మార్గాలు ఏమిటో తెలియజేయలేదని పలువురు వివరిస్తున్నారు. ఉద్యోగులకు వేల కోట్ల బకాయిలున్నా.. చెల్లింపులకు నిధులు కేటాయించలేదని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. డీఏ, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్నాయని, ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ క్లెయిమ్స్, డెత్ క్లెయిమ్స్, పీఎఫ్ చెల్లింపులకు కేటాయింపులు లేవని ఉద్యోగులు మండిపడుతున్నారు. కూటమి సర్కారు ఎన్నికల హామీ 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు శరాఘాతంగా రాష్ట్ర బడ్జెట్ నిలుస్తున్నట్లు పలువురు వాపోతున్నారు.

బడ్జెట్‌లో కేటాయింపులు


ప్రాజెక్టు పేరు	నిధులు (రూ.కోట్లలో)
కేసీ కెనాల్	183.88
తెలుగుగంగ	345.48
గాలేరి–నగరి	488.56
పీబీసీ	170.68
లోయర్ సగిలేరు	20
ఎస్సార్‌బీసీ	5.52

ప్రాజెక్టులకు అరకొర నిధులే

చంద్రబాబు సర్కారు 2025–26 వార్షిక బడ్జెట్‌లో గాలేరి–నగరి సుజల స్రవంతి పథకం పట్ల శీతకన్ను వేశారు. జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం చేసి కుప్పంకు సైతం నీరు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ సర్కారు భావిస్తే, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటికే జీఎన్ఎస్ఎస్ దాదాపు రూ.2 వేల కోట్ల పనులు పూర్తి అయి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా రూ.488.56 కోట్లు మాత్రమే కేటాయింపు చేశారు. అంటే దాదాపు రూ.15 వందల కోట్ల బిల్లులు పెండింగ్ పడనున్నా యి. ఇక జీఎన్ఎస్ఎస్ పరిధిలో పనులు ఏమాత్రం ముందడుగు పడే అవకాశమే లేదని నిపుణులు వివరిస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ రూ.3,243.59 కోట్లు కేటాయించగా, అందులో 15 శాతం మాత్రమే జీఎన్ఎస్ఎస్ కేటాయించడం వెనుక కూటమి సర్కారు దుర్బుద్ధి తేటతెల్లమౌతోందని రాజకీయ పక్షాలు ఆరోపిస్తున్నాయి. జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారిందని పలువురు వాపోతున్నారు. గతంలో గండికోట ప్రాజెక్టు నాన్ ప్రియారిటీ జాబితాలో చేర్చి ఘనత వహించిన అప్పటి చంద్రబాబు సర్కారు.. మరోమారు జీఎన్ఎస్ఎస్ పట్ల అదే ధోరణి ప్రదర్శిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మరోవైపు అన్నమయ్య ప్రాజెక్టు పునఃనిర్మాణం ఊసే లేదు. బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులే లేకపోవడం గమనార్హం.

మహిళలు, నిరుద్యోగులకు మొండి చేయి





సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన మహాశక్తి పథకం, నిరుద్యోగ భృతికి మంగళం పలికింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఆ హామీ మేరకు ఒక్క వైఎస్సార్ జిల్లాలోనే 7,06,94 మంది అర్హులుగా ఉన్నారు. ప్రతి నెలా రూ.106.05 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందిస్తామని ప్రకటించారు, ఆ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 2.80 లక్షల మందికి అందించాల్సి ఉంది. వీరికి ప్రతి నెలా రూ.84 కోట్లు చెల్లించాలి. 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆయా పథకాలకు నిధుల కేటాయింపు ఊసే లేకపోవడం గమనార్హం. అలాగే ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించి రైతులకు గిట్టుబాటు ధరల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి లేమి స్పష్టంగా కన్పిస్తోందని పలువురు వెల్లడిస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీలకు 'చిల్లు'



రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన 2025–2026 వార్షిక బడ్జెట్ అంతా అంకెల గారడీ. మరోసారి చంద్రబాబు తన మోసపూరిత నైజాన్ని చాటుకుంటూ సూపర్‌సిక్స్ హామీలకు 'చిల్లు' పెట్టారు.తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని చెబుతూనే బడ్జెట్‌లో కేటాయింపులు మ ఆత్రం అరకొరగా చేశారు.ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనిందలా సాగింది.గత ఎన్నికల సమయంలో జగన్ కన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని నమ్మించి ఓట్లేయించుకున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు చివరకు మేనిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలు చేయలేని పరిస్థితికి వచ్చారు. ఇది పేదల వ్యతిరేక బడ్జెట్.

– ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ప్రభుత్వ నిజస్వరూపం తెలిసిపోయింది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025, 26 బడ్జెట్‌తో పేదలు, రైతులు, మహిళలకు ఒరిగింది శూన్యం. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలు, పథకాలు ఎగ్గొట్టడానికే ప్రాధాన్యం ఇచ్చింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు అమలు చేయలేని హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్నారు. తరువాత చంద్రబాబు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్న వైనంతో కూటమి ప్రభుత్వ నిజస్వరూపం తెలిసిపోయింది. అసెంబ్లీలో జరిగిన బడ్జెట్ సమావేశంలో గత ప్రభుత్వాన్ని విమర్శించడం.. చంద్రబాబు, లోకేష్‌లను పొగుడుకోవడం తప్ప పథకాలకు కేటాయింపులు చేయలేదు. దీంతో ఈ ఏడాది సూపర్‌సిక్స్ పథకాలకు మంగళం పాడినట్లేనని తేటతెల్లం అయింది.

– కొరముట్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రైల్వేకోడూరు

ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు



రూ.3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన భారీ రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు. అన్ని పథకాలకు కేటాయింపులు చూపడం కోసం ఆచరణాత్మకం కాని ప్రతిపాదనలు చేసినట్లు అనిపిస్తోంది. ఒకవైపు అప్పులు, లోటు పెరుగుతున్నా మరోవైపు కార్పొరేట్లకు 20% వయబిలిటీ గ్యాప్ పేరుతో కేటాయించడం ప్రభుత్వం సంపన్నుల కొమ్ము కాస్తున్నదనడానికి నిదర్శనం.

– సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడేదిగా లేదు



రూ.3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన రాష్ట్రబడ్జెట్ ప్రజాసంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే విధంగా లేదు. పన్ను ఆదాయం రూ14వేల కోట్లు, పన్నుయేతర ఆదాయం రూ.12వేల కోట్లుగా చూపడం ద్వారా ప్రజలపై భారం పెరుగుతుంది.

– నరసింహులు,సీపీఐ జిల్లా కార్యదర్శి

ఉద్యోగులకు మొండిచేయి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు మొండిచేయి చూపింది. డీఏ, పీఆర్‌సీలకు సంబంధించి వేలకోట్ల బకాయిల ఊసే లేదు. కూటమిసర్కార్ ఎన్నికల హామీల్లో భాగంగా మధ్యంతర భృతి ఐఆర్ బడ్జెట్‌లోచూపలేదు.

–జనార్దన్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్

కేటాయింపులు శూన్యం



బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం. అంతా అంకెల గారడీ, అభూత కల్పనలే. ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. విజన్ లేదు, విజ్డమ్ లేదు. కేవలం ఇంద్రజాలమే.

–గాజుల భాస్కర్, అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

ప్రజలకు ఉపయోగకరంగా లేదు



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఉపయోగకరంగా లేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవలకు అరకొర కేటాయింపులు జరిగాయి. నిరుద్యోగ భృతి, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం లాంటివి ఊసేలేదు. బడ్జెట్ ప్రసంగంలో వైఎస్సార్‌సీపీని విమర్శించడానికేప్రాధాన్యత ఇచ్చారు.

–జయరామచంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు ఉపేక్షించేది లేదు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె: ప్రభుత్వస్థలాలను ఆక్రమించడం, ఇతరులకు విక్రయించడం, కబ్జాలకు పాల్పడటం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని, కబ్జాదారులపై కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హెచ్చరించారు. రెవెన్యూ అధికారులపై భూకబ్జాదారుడు జరిపిన దాడిలో గాయపడిన ఉద్యోగులను పరామర్శించేందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి మదనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. ఆర్ఐ శేషాద్రి, వీఆర్వో ప్రసాద్‌లను పరామర్శించి, ధైర్యం చెప్పారు. దాడికి పాల్పడ్డ కబ్జాదారుడిని అరెస్ట్ చేసినందుకు పోలీస్‌శాఖను, ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నందుకు రెవెన్యూ అధికారులను అభినందించారు. ప్రభుత్వస్థలాలు కబ్జాలకు పాల్పడినా, రెవెన్యూ అధికారులపై దాడులు చేసినా పరిణామాలు ఇలాగే తీవ్రంగా ఉంటాయనేందుకు ఇది ఒక హెచ్చరికగా పేర్కొన్నారు. అనంతరం మండలంలో నిర్వహిస్తున్న పీ–4 సర్వే, పీజీఆర్ఎస్, రీసర్వే, రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార ప్రగతిపై సిబ్బందితో సమీక్షించారు. జిల్లాలో పీ–4 సర్వే(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) పక్కాగా చేపట్టాలన్నారు.

- పేదల ఆక్రమణలో ఉన్నటువంటి అభ్యంతరం లేని యూఏడబ్ల్యూ, ఏడబ్ల్యూ భూములను అర్హత కలిగిన వారికి జీఓ నంబర్ 30 కింద 150 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అగ్రిమెంట్లు, దొంగపట్టాలతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న పేదలు...జీఓ.నెం.30 ప్రకారం ప్రభుత్వనిబంధనలు పాటిస్తూ దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజయులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

రాయచోటి: వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలందరికీ తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అలాగే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల వ్యాప్తి జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పలు అంశాలపై వీసీ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ హాజరయ్యారు.

అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తాం

మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి రాయచోటి: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఈ ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామని మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. శుక్రవారం రైల్వేకోడూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద సినీ నటుడు పోసాని కృష్ణమురళికి కోర్టు రిమాండ్ విధించిన అనంతరం మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ నేత జల్లా సుదర్శన్‌రెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలియజేశారు. మా ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెత్ అని, పోసాని కృష్ణ మురళి మీద లైఫ్ పనిష్మెంట్ సెక్షన్ 111 పెట్టారని, ఈ సెక్షన్ పనికిరాదని కోర్టు వారు స్పష్టంగా చెప్పారన్నారు. ఐటీ యాక్ట్ కూడా వర్తించదని కోర్టు చెప్పిందని, వర్గ వైషమ్యాలు క్రియేట్ చేసినందుకు 196, 353 క్లాస్–2 ఈ రెండు సెక్షన్లకు 5ఏళ్లలోపు పనిష్మెంట్ ఉంటుందన్నారు. అయితే ఐదేళ్లలోపు పనిష్మెంట్ ఉన్న వాటికి రిమాండ్‌ పంపించాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే ఆర్నేష్ కుమార్ సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం రిమాండ్‌కు పంపించాల్సిన అవసరం లేదని, 41 ఏ నోటీస్ ఇవ్వాలని స్పష్టంగా సుప్రీంకోర్టు చెప్పడం జరిగిందన్నారు. ఐదేళ్లలోపు శిక్ష ఉంటే ఆర్నేష్ కుమార్ తీర్పు ప్రకారం రిమాండ్ చేయడానికి లేదని, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం మేము చెప్పిన వాదనలు గౌరవ కోర్టు వారు తీసుకోలేదని, కాబట్టి ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెత్ అని వివరించారు. రాష్ట్రంలో ఏ వైఎస్సార్‌సీపీ కార్యకర్త భయపడాల్సిన అవసరం లేదని, లీగల్ టీం ఎక్కడికైనా కదిలి రావడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యకర్తలకు అండగా న్యాయ పోరాటం చేస్తామన్నారు.

విద్యార్థి.. విజయోస్తు

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కేంద్రాల వద్ద బందోబస్తు



రాజంపేట టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

జిల్లాలో పరీక్ష కేంద్రాలు:	49
చీఫ్ ఆఫీసర్స్:	49
డిపార్ట్‌మెంట్ అధికారులు:	49
కస్టోడియన్ అధికారులు:	06
ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు:	02
సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు:	04
పరీక్షల కమిటీ సభ్యులు:	05

రాజంపేట టౌన్/రాయచోటి: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రానే వచ్చేశాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానుండగా, ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కృష్ణయ్య అధ్వర్యంలో వివిధ విభాగాలకు సంబంధించి అధికారులను కూడా నియమించారు. విద్యార్థులకు ఇబ్బందులు కూడా కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులతో పాటు విధులకు హాజరయ్యే అధికారులు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది ఎవరు కూడా పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లకూడదని ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

నిఘానీడలో...

అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంతో పాటు విజయవాడలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేశారు. ఈ రెండు కార్యాలయం నుంచి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించవచ్చు.

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేసేందుకు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. జిల్లాలో ఏ పరీక్షా కేంద్రంలో అయినా వసతులు సరిగా లేకున్నా, సమస్యలు ఉన్నా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 8106624853 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 49 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 2 మోడల్ స్కూళ్లు, 3 సోషల్ వెల్ఫేర్, 1 ప్రైవేట్ ఎయిడెడ్, 22 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. ఈ పరీక్ష కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 13703 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 1159 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్‌కు సంబంధించి 12944 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1110 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో కొంతమంది విద్యార్థులు శుక్రవారం సాయంత్రం పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చి తమకు కేటాయించిన గదులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకున్నారు.